# అబ్రాహాముతో దేవుని నిబంధన

## హ్యూగో మెక్కార్డ్

"ఛేధించుట" అని అర్థమిచ్చునట్టి *barah* అనే మూల పదంనుండి "నిబంధన" అనే పదం వచ్చింది (ఆది. 15:18). నిబంధన అంటే బంధం, ముద్రింపబడిన ఒప్పందమై యుంది. "నిబంధన చేయు" అనే ప్రయోగం, "ఛేధించు, చెక్కు" అని అర్థమిచ్చే రెండవ *karath berith* అనే పదాన్ని ఉపయోగించుకొంటుంది. ఉపయోగింపబడిన పద ప్రయోగానికి "నిబంధనను చెక్కు" అని అక్షరార్థం.

### సంతాన వాగ్దానం

సంవత్సరాల తరబడి దేవుడు అబ్రాహాముకు సంతాన వాగ్దానం జ్ఞప్తి చేస్తూనే వచ్చాడు (ఆది. 12:7; 13:15). సంవత్సరాలు గడిచేకొద్ది, యింకను పిల్లలు లేని అబ్రాహాము తన యింటి "పెద్ద దాసుడు" తనకు వారసుడగునని తలంచాడు. అయితే, వారసుడు అబ్రాహాము యొక్క గర్భ వాసములోనుండి వస్తాడని దేవుడు స్థిరంగా తెలిపాడు (ఆది. 15:4). చివరికి, అతని సంతానం నక్షత్రములవలె లెక్కలేనంతగా ఉంటుంది. దేవుని వాగ్దానం భూమిమీద జీవించిన కోట్లకొలది మంది హెబ్రీయులయందు నెరవేర్చబడింది. అంటే అబ్రాహాము కుమారుడైన ఇస్సాకు ద్వారా అది నెరవేర్చబడింది. అతి గొప్ప "సంతతి" క్రీస్తు (గలతీ. 3:16), ఆయన ద్వారా జన సమూహాలు – హెబ్రీయులలోనుండి మాత్రమే కాదు, అన్య జనులలోనుండి వచ్చినవారు కూడా (ప్రకటన 7:4, 9) – అబ్రాహాము పిల్లలై ఉంటారు (గలతీ. 3:29).

### భూ వాగ్దానం

దేవుడు అబ్రాహాముతో "చేసిన" నిబంధనలో విస్తరించిన వారసులు చేర్చబడడం మాత్రమేగాక, ఐగుప్తునుండి అష్షూరువరకుగల విస్తారమైన భూ భాగాన్ని వారికి నివాస స్థలంగా ఏర్పరచాడు. ఆ వాగ్దానపు నెరవేర్పుకు దీర్ఘకాలం పట్టేలా కన్పిస్తుంది (ఆది. 15:13 చూడు), అయితే దాన్ని నెరవేర్చడానికి దేవుడు బద్ధుడైయున్నాడు. నాల్గువందల ముప్పై సంవత్సరాల అనంతరం (నిర్గమ. 12:40), అబ్రాహాము సంతతివారు వాగ్దాన భూమి వైపుకు రానారంభించారు. చివరకు, "యెహోవా ప్రమాణము చేసి వారి పితరుల కిచ్చెదనని చెప్పిన దేశమంతయు ఆయన ఇశ్రాయేలీయులకప్పగించెను" (యెహోషువ 21:43; 23:14 చూడు; న్యాయాధి. 2:3; 1 రాజులు 4:21). దురదృష్టవశాత్తు, దేవుడు తాను చేసిన వాగ్దానం యింకా నెరవేర్చలేదని అంటారు.

వెయ్యేండ్ల పరిపాలనా వాదులు దేవుణ్ణి బహు సంకటమైన పరిస్థితిలో పెట్టాలని చూచారు.

## అత్యంత ప్రాముఖ్యమైన వాగ్దానం

ఆదికాండం 15 అంతా ప్రాముఖ్యమైనదే; అయితే అందులో ఒక వచనం ప్రత్యేకమైన ప్రాముఖ్యతగలదై ఉంది. మనం ఎలా రక్షింపబడ్డామో గ్రహించడానికి సహాయంగా రోమా 4:3; గలతీ. 3:6; యాకోబు 2:23ల్లో 6వ వచనం (ఆది. 15:6) ఉపయోగింప బడింది.

అబ్రాహాము "దేవుని నమ్మెను" అని మోషే నిర్ధారించింది, దేవుని యొక్క ఉనికిని అతడు మానసికంగా అంగీకరించాడని చెప్పడానికి కాదు. నిబంధన యివ్వక ముందే అబ్రాహాము దేవుని నమ్మాడు. (అతడు తన తండ్రియొక్క విగ్రహారాధనలో ఎన్నడూ పాలుపొందినవాడు కాకపోవచ్చు.) పైగా, తన సొంత రక్తంలోనుండి తనకు (సంతతి) వారసుడు కలుగుతాడనే దేవుని వాగ్దానమందు అతడు నమ్మికయుంచాడు. ఆ విశ్వాసము అతనికి నీతిగా ఎంచబడింది.

అబ్రాహాము విశ్వాసము మోషే ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలకు పూర్ణంగా భిన్నమైనది (రోమా 3:28; 4:2-5; గలతీ. 2:16; 3:5). సీనాయి పర్వతము వద్ద ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు యివ్వబడడానికి ఎంతో ముందుగా అబ్రాహాము తన బహుమానాన్ని పొందాడు. నేడైతే, క్రీస్తును గూర్చిన దేవుని వాక్యమునందలి మానవ విశ్వాసము (రోమా 4:23-25) నీతిగా ఎంచబడింది. మరియు అలాటి విశ్వాసము మోషే ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలతో సంబంధం కలిగింది కాదు. ఆ రెండింటిని ఎవడైనా జత చేయడానికి ప్రయత్నించినట్లయితే, క్రీస్తునుండి అట్టివాడు వేరు చేయబడినవాడై ఉంటాడు (గలతీ. 5:4).

అబ్రాహాము యొక్క విశ్వాసము కేవలం విశ్వాసం మాత్రమే కాదు. అతని విశ్వాసపు "అంచెలు" అనేకములు (రోమా 4:12). వందల మైళ్లు అనేక దేశాలగుండా అతడు ప్రయాణం చేశాడు. పైగా, ఆదికాండం 15:6లో మనం ఏ విశ్వాసాన్ని గూర్చి చదువు తున్నామో, అది అబ్రాహాము కత్తి దూసి తన కుమారుని బలిగా అర్పించబూనేవరకు నెరవేర్చబడలేదు (యాకోబు 2:23).

ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలను సూటిగా మినహాయించినా, రోమా, గలతీ పత్రికలలో వర్ణింపబడిన విశ్వాసము, విధేయతను ఏ రూపంలోను మినహాయించదు (రోమా 1:5; 16:26). విశ్వాసం ప్రతిపాదింపబడిన ప్రతిసారి విశ్వాస సంబంధమైన విధేయతా కార్యాలు లేక వివరాలు ప్రస్తావించబడలేదు. ఉదాహరణకు, రోమా 5:1లో విశ్వాసమంటే: (1) దేవుడున్నాడు లేక క్రీస్తు ఆయన కుమారుడైయున్నాడని మానసికంగా నమ్మడం, (2) మారుమనస్సు పొందడం, (3) ఒప్పుకొనడం, లేదా (4) బాప్తిస్మం పొందడమని ప్రస్తావించబడలేదు (రోమా 6:3, 4 చూడు). అలా కాకపోయినా, నీతిమంతులనుగా తీర్చే "విశ్వాసంలో" ఈ నాల్గు విషయాలు యిమిడి ఉన్నాయి. దేవుని పిల్లలుగా చేసే గలతీ. 3:26లోని విశ్వాసం - మారుమనస్సు లేదా బాప్తిస్మాన్ని నిర్దిష్టంగా

సూచించలేదు, అయితే విశ్వాసంలో బాప్తిస్మము చేర్చబడిందని తరువాత వచనం చూపుతోంది.

క్రీస్తును ధరించుకొనకపోతే, ఒకడు దేవుని కుమారుడైయుండడు. ఒకడు బాప్తిస్మం పొందేవరకు క్రీస్తును ధరించుకొనే మార్గం లేనందున, దేవుని పిల్లలనుగా చేసే విశ్వాసంలో బాప్తిస్మం చేర్చబడింది. (దానిలో చేర్చబడిన దానంతటితో కూడ) విశ్వాసము క్రియయే అయ్యుంటుంది (యోహాను 6:29), అయితే అది దేవుని క్రియ. మానవుని ఏ కార్యమూ రక్షణను యివ్వనేరదు (ఎఫెసీ. 2:8, 9).